క్లుప్తంగా

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన మూడు కుటుంబాలు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబాలు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సబితారెడ్డి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో నాదర్‌గుల్ సహకార బ్యాంక్ డైరెక్టర్ యెల్చెల సుదర్శన్‌రెడ్డి, కోటగిరి జంగయ్య, నరేశ్‌చారి, మాజీ కౌన్సిలర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



విద్యార్థులకు టై, బెల్టులు అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేపీ స్థానిక నాయకులు బెల్టు, టైలను అందజేశారు. బుధవారం ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామనేటి బాల్‌రాజ్, యువ మోర్చా అధ్యక్షుడు మామిళ్ల రాజుముదిరాజ్ చిన్నారులకు సొంత నిధులతో టై, బెల్టులు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా అందరూ ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ప్రాంత ప్రజలను కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



మహేందర్‌ను సన్మానిస్తున్న ఏకలవ్య క్లబ్ సభ్యులు

తుక్కుగూడ: రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం కోశాధికారిగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి సర్దార్ నగర్ గ్రామానికి చెందిన ముత్యాల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో బుధవారం తుక్కుగూడ ఏకలవ్య క్లబ్ సభ్యులు మహేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బీ.వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, కుమార్, రాజేశ్, సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో 'సైబర్‌క్రైం'పై పోటీ పరీక్ష

కడ్తాల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఐ వరప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సైబర్‌క్రైం ఆవేర్‌నెస్‌పై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. సైబర్ నేరాలు, నైతిక విలువలు, కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన ఠాణాలో సీఐ శివప్రసాద్ అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తీసుకు రావాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడటం మంచిది కాదని, దానిని వాడేటప్పుడు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు సేవా కార్యక్రమాలు

కడ్తాల్: తన కుమారుడు రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. కొడుకు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చామని, ఆడబిడ్డల వివాహంతో పాటు ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం అందజేస్తున్నామని, పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం

పదిహేను ఏళ్లయినా.. కనీస సౌకర్యాలు కరువు • పట్టించుకోని పాలకులు, అధికారులు



సాయినగర్ కాలనీ రోడ్డు

బడంగ్‌పేట్: పేరుకే సాయినగర్. అన్నీ సమస్యలే. 15ఏళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తదితరులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ ప్రభుత్వ సౌకర్యాలకు నోచుకోవడం లేదు. బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ సాయినగర్ ఫేస్–1లో వీధి దీపాలు, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇప్పటికీ అంతంత మాత్రమే.

చందాలు వేసుకుని..

కాలనీలో స్ట్రీట్ లైట్లు, రక్షణ కోసం సీసీ కెమరాలను చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్నామని స్థానికులు తెలిపారు. కొత్తగా మిషన్ భగీరథ ట్యాంకును నిర్మించారు. ఇంకా ప్రారంభించలేదు. కానీ.. జలమండలి నుంచి రూ.18 వేల నుంచి 20 వేల వరకు నల్లా బిల్లులు బకాయి ఉన్నారని మెసేజ్‌లు వస్తున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. క్యాన్ నంబర్ ఇవ్వకుండా, నీరు వదలకుండా బిల్లులు ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నారు.

కుక్కల బెడద..

కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నామని, దోమలు, ఈగల వృద్ధితో రోగాల బారిన పడుతున్నామని అయినా కార్పొరేషన్ వారు ఫాగింగ్ చేయడం లేదని వాపోయారు. ఇదే విషయాన్ని గతంలో పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాత, కార్పొరేటర్ అమిత, కమిషనర్ రఘుకుమార్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలనీలో ప్రసిద్ధి చెందిన ఈదమ్మ ఆలయం ఉందని, నిత్యం భక్తులతో కిటకిటలాడుతుందని, కానీ రోడ్లు అధ్వానంగా ఉండటం వలన అసౌకర్యానికి గురవుతున్నామని ప్రాంత ప్రజలు తెలిపారు. అభివృద్ధి కోసం కార్పొరేటర్‌ను వివరణ కోరగా.. అదిగోఇదిగో అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీ అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి సరఫరా చేయకుండా బిల్లు



కార్పొరేషన్‌కు అన్ని రకాల పన్నులు కడుతున్నాం. విధిగా వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదు. పేరుకే పెద్దకాలనీ. అభివృద్ధి ఏమాత్రం లేదు. రోడ్లు, వీధిలైటు లేవు. ఇప్పటికీ గ్రామ పంచాయతీ నుంచే నీటి సరఫరా అవుతోంది. జలమండలి నీటి పంపిణీ చేయకుండానే బిల్లు కట్టమంటోంది. అధికారులు కాలనీని సందర్శించే విషయాలు వెలుగు చూస్తాయి.

– కరుణాకర్‌రెడ్డి, కాలనీవాసి

కూల్చివేస్తే.. కాల్చుకుంటాం

నిర్మాణాన్ని తొలగించేందుకు వెళ్లిన అధికారులకు చేదు అనుభవం



ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన బేస్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పహాడీషరీఫ్: చెరువు శిఖం భూమిలో నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించేందుకు వెళ్లిన నీటి పారుదల శాఖ అధికారులకు కబ్జాలో ఉన్న కుటుంబ సభ్యుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. జల్‌పల్లి మన్సిపాలిటీలోని తాళ్లకుంట చెరువు వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తాళ్లకుంట శిఖం భూమి(119 సర్వే నంబర్)లో ఓ కుటుంబం 100 గజాల విస్తీర్ణంలో బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టింది. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు శశికళ, జనార్దన్‌లు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చివేసేందుకు అక్కడికి చేరుకున్నారు. కూల్చివేస్తే తాము పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని బాధిత కుటుంబాల సభ్యులు భీష్మించారు. పోలీస్ బందోబస్తు లేని కారణంగా అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. త్వరలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు. ఈ ఘటన అనంతరం బాలాపూర్ ఆర్.ఐ జమీల్ అక్కడికి చేరుకొని నిర్మాణాన్ని పరిశీలించారు.

చినుకు పడితే.. చిమ్మచీకట్లో చుక్కాపూర్

మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

తలకొండపల్లి: వర్షాలు పడితే.. చుక్కాపూర్ గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ప్రత్యేకంగా మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రైతులతో కలిసి బుధవారం చుక్కాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. వేలాడుతున్న తీగలను సరిచేయాలన్నారు. చెన్నారం గ్రామం మధ్యలో ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పేర్కొన్నారు. చెన్నారం నుంచి బోడియా తండా వరకు విద్యుత్ స్తంభాలను అమర్చి మరోలైన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇనుము పోల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని, ఉప కేంద్రంలో రాత్రి వేళల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. జెఎల్‌ఎం శివ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, జీర్యానాయక్, లింగయ్య, పర్వతాలు, రామచంద్రయ్య, నర్సింహ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

భయపెడుతున్న గ్రామ సింహాలు

- నియంత్రణకు చర్యలు తీసుకోండి
- కమిషనర్ వసంతకు హిందూదళం సభ్యుల వినతి



కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేస్తున్న హిందూదళం సభ్యులు

ఆమనగల్లు: 'ప్రతి వీధిలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎటునుంచి ఎవరిపై దాడికి పాల్పడతాయో.. ఏ హానీ తలపెడతాయో భయంగా ఉంది. వాటి బారి నుంచి ప్రజలను కాపాడండి' అని మునిసిపల్ కమిషనర్ వసంతకు హిందూదళం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆమనగల్లు పట్టణంలో శునకాల బెడద ఎక్కువయిందని తెలిపారు. రోడ్డుపై వెళ్లేవారిని వెంబడిస్తూ ఎగబడుతున్నాయని చెప్పారు. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అయినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో దళం సభ్యులు టిల్లు యాదవ్, పాతకోట శ్రీశైలం, కుమార్‌గౌడ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షూ వితరణ

యాచారం: మండల పరిధి కొత్తపల్లి గ్రామం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 200 మంది విద్యార్థులకు బుధవారం పి.రవి కుమార్తె మౌనికరెడ్డి షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్కారు బడుల్లో నిరుపేదల పిల్లలే ఎక్కువగా ఉంటారని, వారికి నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆమె కోరారు. వారికి అండగా ఉంటానని ఆమె చెప్పారు.

బర్రెలక్కకు సన్మానం



శిరీషతో యువ నాయకులు

కడ్తాల్: యువ నాయకురాలు బర్రెలక్క(శిరీష)ను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ఆమె హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో కడ్తాల్ మండల కేంద్రంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు యువ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శిరీష మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. నిరుద్యోగుల తరపున పోరాడేందుకు సిద్ధమని, తనకు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, నాయకులు జహంగీర్‌అలీ, సురేశ్, మణికిరణ్, మణికాంత్, గణేశ్, కార్తీక్, రాఖీ, శివ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు దారు శరత్ రాయుడు(చందు) సూచించారు. బుధవారం మండల పరిధి పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చందు టై, బెల్టులు, ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు చిన్నారులకు నాణ్యమైన బోధన చేయాలని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్ఐ జహీర్‌ఖాన్ విద్యార్థులకు గ్రీన్ కార్పెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.కిరణ్‌కుమార్, నర్సింహ, అంగన్‌వాడీ టీచర్ శోభ, యాదగిరి పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఇబ్రహీంపట్నం: కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇందు విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వెంకట్‌రావు అన్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి తగినట్లుగా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ యువ శాస్త్రవేత్త నాగేంద్రబాబు, కళాశాల సెక్రటరీ అనూప్ చక్రవర్తి, డీన్ డా.రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ యాదగిరిరావు, హెచ్‌ఓడీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలకు కృషి



ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గ కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం సర్కారు దవాఖానను ఆయన సందర్శించి రోగులు, వైద్యులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, రోగులకు నాణ్యతో కూడిన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు సరిపడా లేకపోవడాన్ని గ్రహించి వైద్యులను నియమించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి.. ఎనిమిది మంది వైద్యులను నియమించామని తెలిపారు.

ట్రస్ట్ ద్వారా పరికరాలు..

ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, ఇతర రోగులకు ఆపరేషన్లు చేయడానికి కావాల్సిన పరికరాలను కేఎల్ఆర్ ట్రస్టు ద్వారా వెంటనే సమకూర్చుతామని ఆయన తెలిపారు. ఇక నుంచి వారానికి ఒకసారి ఆస్పత్రిని సందర్శించి రోగులకు సేవలు ఏవిధంగా అందుతున్నాయో తెలుసుకుంటానని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అంతకుముందు ఆస్పత్రిని సందర్శించి వైద్యులు, రోగులతో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఆస్పత్రికి అందించిన ఆధునీకరణ పరికరాలు, మిషన్లను ఆయన పరిశీలించి, రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, మహేశ్వరం ఆస్పత్రి సూపరింటెండెంట్ అమీర్ సిద్ధిఖీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇబ్రాయేలు, యాదయ్య, రాజునాయక్, మల్లేశ్‌యాదవ్, రఘుపతి, ప్రశాంత్‌రెడ్డి, అల్లె కుమార్, పరిగి రాఘవేందర్ రెడ్డి, అంధ్యానాయక్, లాజర్, కృష్ణా నాయక్, పాండునాయక్, విఠల్‌నాయక్, శివ, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఇర్షాద్, రాములు, జంగయ్య, శ్రీకాంత్, పరమేశ్ పలువురు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మరోమారు మానవత్వం చాటుకున్నారు. పేద కుటుంబానికి అండగా నిలిచారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన ఆయన.. కందుకూరు మండలం దెబ్బడగూడ గ్రామానికి చెందిన బాలమణి అనే మహిళ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చారు. కేఎల్లార్ ఆస్పత్రి నుంచి బయటకు వెళ్తున్న క్రమంలో బాలమణి మహిళ ఎదురుపడి తనది పేద కుటుంబమని, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తమని ఆదుకోవాలని కేఎల్లార్‌ను కోరింది. దీంతో ఆయన ఆమెతో మాట్లాడారు. ఆమెకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంతో పాటు పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తానని మహిళకు హామీనిచ్చారు. కేఎల్లార్‌కు మహిళ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు



అనాథ ఆశ్రమానికి సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలంపియాడ్ విద్యార్థులు కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి బుధవారం 10 క్వింటాళ్ల బియ్యం, 60 కేజీల కందిపప్పు, 30 కేజీల వంటనూనె, ఇతర వస్తువులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచి సేవాభావాలను అలవాటు చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. సమాజం పట్ల అవగాహన కల్పించినప్పుడు విద్యార్థులు భవిష్యత్‌లో బాధ్యతగల పౌరులుగా తయారవుతారని తెలిపారు. సమాజంలో అభాగ్యుల పట్ల సేవాభావం ఏర్పరచుకోవాలని కోరారు. పిల్లలు, పెద్దలు తమ జన్మదిన వేడుకలను అనాథలు, వృద్ధాశ్రమాల్లో నిర్వహించుకొనే అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల సీఏవో ఏ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.మహేశ్, ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి



అమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: వినాయకచవితి సందర్భంగా బాలాపూర్‌లో గణేషుడు కొలువుదీరనున్న నేపథ్యంలో అస్తవ్యస్తమైన రోడ్లను బాగుచేయించాలని కోరుతూ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత.. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలిని కలిసి వినతిప్రతం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిమజ్జన సమయంలో బాలాపూర్ నుంచి చాంద్రాయన్‌గుట్ట మీదుగా గణనాథుడి శోభాయాత్ర నిర్వహిస్తారని, గుంతలమయమైన రోడ్లకు మరమ్మతు చేయించాలని మేయర్ పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి రోడ్ల బాగుకోసం విన్నవించినట్లు తెలిపారు. వాటితో పాటు నవరాత్రులకు బాలపూర్‌కు అదనపు బస్‌లు నడిచేలా చూడాలని మంత్రిని కోరారు. వర్షాలకు బీటీరోడ్లు కాస్తా దెబ్బతింటున్నాయని వాటి స్థానంలో సీసీరోడ్లు వేసేలా చూడా లని మంత్రి పొన్నంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

సేవలు విస్తృతం చేస్తాం

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: మారుమూల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని లయన్స్‌క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. లయన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ సభ్యుల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ ఏడాది అధికంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యానికి చర్యలు తీసుకోవడంతో పాటు.. వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డా.దామోదర్‌రెడ్డి, లయన్స్ కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, పీఆర్‌ఓ పాష, సభ్యులు రమేశ్, రామచంద్రారెడ్డి, ఓంకారం, విష్ణువాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నటరాజ్ యాదయ్య, రాంరెడ్డి, డా.కృష్ణ, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, కొండల్‌రెడ్డి, సత్యం, శ్రీను, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.